# డా॥ వై.ఎస్.ఆర్. పొలంబడి

**ఉపోద్ఘాతం:**

వ్యవసాయంలో విచక్షణా రహితంగా వాడుతున్న రసాయనిక ఎరువులు మరియు క్రిమి సంహారక మందుల వలన, పంట దిగుబడులు పెరగకపోవడం, భూసారం దెబ్బ తినడం, చీడ పీడలు క్రిమి సంహారక మందులను తట్టుకునే నిరోధక శక్తిని పెంచుకోవడం, వ్యవసాయ ఖర్చులు అనూహ్యంగా పెరగడం, వాతావరణ కాలుష్యం తీవ్రమవటం లాంటి దుష్ఫలితాలు ఏర్పడి అవి వ్యవసాయ సుస్థిరతకు పెను సవాళ్ళుగా మారాయి.

ఈ సవాళ్ళను ఎదుర్కొనేందుకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డా॥ వై.ఎస్.ఆర్. పొలంబడి కార్యక్రమాన్ని ఒక సరియైన సాంకేతిక సాధనంగా భావించి, పెద్ద ఎత్తున రాష్ట్ర మంతటా నిర్వహిస్తుంది. వ్యవసాయంలో అనవసరపు ఖర్చును తగ్గించి, తద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించే దిశగా సరియైన నిర్ణయాలు తీసుకునే సాధికారతను డా॥ వై.ఎస్.ఆర్. పొలంబడి రైతులకు అందిస్తుంది.

**డా॥ వై.ఎస్.ఆర్. పొలంబడి ఉద్దేశ్యం:**

ఒక పంట పరిసరాలలోని పర్యావరణ సంబంధమైన అంశాలను, రైతు స్వయంగా గమనించి, విశ్లేషించి, అందుకు అనుగుణంగా రసాయనిక వనరుల వినియోగాన్ని క్రమబద్ధీకరణ చేయుట ద్వారా వ్యవసాయ ఖర్చులను తగ్గించుకునేందుకు అవసరమైన సరియైన నిర్ణయాలను తీసుకోవటంతో పాటు, సమగ్ర పంటల యాజమాన్యంలో భాగమైన సమగ్ర సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర కలుపు యాజమాన్యం, నీటి యాజమాన్యం, వ్యవసాయ యాంత్రీకరణ మొదలైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, నాణ్యమైన అధిక దిగుబడులను సాధించేందుకు అవసరమైన సాధికారతను రైతులకు అందించటమే పొలంబడి లక్ష్యం.

**డా॥ వై.ఎస్.ఆర్. పొలంబడి నిర్వహణకు అనుసరించిన ప్రామాణికం:**

ఆహార మరియు వ్యవసాయ సంస్థ (FAO) రూపొందించిన 'ఫార్మర్ ఫీల్డ్ స్కూల్' (FFS) అనే కార్యక్రమాన్ని ప్రామాణికంగా తీసుకుని, డా॥ వై.ఎస్.ఆర్.పొలంబడి కార్యక్రమం రాష్ట్ర మంతటా అమలు చేయుచున్నాం.

**డా॥ వై.ఎస్.ఆర్. పొలంబడి నిర్వహణ పరిధి:**

ప్రతి రైతు భరోసా కేంద్ర పరిధిని (RBK), పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించటానికి ఒక యూనిట్‌గా తీసుకోబడింది. రైతులకు పలు రకాలైన సేవలు అందించటానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొత్తం 10,778 రైతు భరోసా కేంద్రాల (RBK) యందు, ఒక్కొక్క ఆర్.బి.కె పరిధిలో ఒక పొలంబడి కార్యక్రమం ప్రతి ఖరీఫ్ మరియు రబీ సీజనులలో నిర్వహించబడుతుంది.

**డా॥ వై.ఎస్.ఆర్. పొలంబడి విశిష్ఠతలు:**

- ఒక పంట కాలంలో, వారానికి ఒక రోజు చొప్పున 14 వారాల పాటు క్షేత్ర స్థాయిలో రైతుల భాగస్వామ్యంతో పొలంబడి కార్యక్రమం నిర్వహించబడుతుంది.
- ప్రతి ఆర్.బి.కె పరిధిలో ఎంపిక చేసిన 30 మంది రైతులతో పొలంబడి కార్యక్రమం నిర్వహించబడుతుంది.
- పొలంబడి నిర్వహించనున్న పంట యందు, 25 ఎకరాల విస్తీర్ణంలో, విత్తనం వేసినప్పటి నుండి పంట కోసే వరకు గల మధ్య కాలంలో 14 శిక్షణా తరగతులను పొలంబడి కార్యక్రమం క్రింద VAAలు నిర్వహిస్తారు.
- గ్రామ వ్యవసాయ సహాయకుడు (వి.ఎ.ఎ) తన పైస్థాయి అధికారుల పర్యవేక్షణలో సౌలభ్యకుడు (Facilitator ) గా వ్యవహరిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.
- ఒక వారంలో మంగళ వారం నుండి శుక్ర వారం వరకు ఏదో ఒక రోజును పొలంబడి నిర్వహణ రోజుగా స్థిరీకరించి, ప్రతి వారం అదే రోజున పొలంబడి నిర్వహించబడుతుంది.
- పొలంబడి కార్యక్రమాన్ని ప్రారంభించటానికి ముందు, ప్రాథమిక సర్వే ద్వారా ఒక పంట యందు అధిక దిగుబడి సాధించటంలో ఎదురవుతున్న అవరోధాలను గుర్తించి, వాటిని అధిక మించటానికి అనుసరించవలసిన పరిష్కార మార్గాలను సూచించడం జరుగుతుంది.
- ప్రాథమిక సర్వే ఆధారంగా, స్థానిక అవసరాలననుసరించి పొలంబడి పాఠ్యాంశాలు రైతుల భాగస్వామ్యంతో రూపొందించబడతాయి.
- ఈ కార్యక్రమంలో శిక్షణ పొందే రైతులు పొలం పరిసరాల విశ్లేషణ (AESA), భాగస్వామ్య కార్యాచరణ పరిశోధన (Participatory Action Research) ప్రయోగాలు, క్షేత్ర స్థాయి ప్రదర్శనలు, బృంద విన్యాసాలు మొదలైన కార్యక్రమాలను తమంతటతాముగా సౌలభ్యకుని పర్యవేక్షణలో నిర్వహిస్తూ, వాటి గురించి పూర్తిగా తెలుసుకుంటారు.
- సమగ్ర పంటల యాజమాన్యంలో భాగమైన సమగ్ర సస్య రక్షణ, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర కలుపు యాజమాన్యం, సాగునీటి యాజమాన్యం, వ్యవసాయ యాంత్రీకరణ మొదలైన సాంకేతిక అంశాలపై రైతులకు శిక్షణ ఇవ్వబడుతుంది.
- మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులను (Good Agricultural Practices) పొలంబడి కార్యక్రమంలో అమలు చేసి చూపించటం జరుగుతుంది.
- పొలంబడి కార్యక్రమంలో రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇవ్వబడుతుంది. దీని వలన ఈ కార్యక్రమంలో రైతుల భాగస్వామ్యం పెరగటంతో పాటు, క్షేత్ర స్థాయిలో గల అంశాలను గమనించటం, అధ్యయనం చేయటం, వాటిని విశ్లేషించటం, సరియైన నిర్ణయాలు తీసుకోవటం మొదలైన అంశాల పట్ల అవగాహన కూడా మెరుగవుతుంది.

- పొలంబడి కార్యక్రమంలో శిక్షణ పొందే రైతులకు, కీలక వ్యవసాయ వనరులైన జీవ ఎరువులు, జీవ క్రిమి సంహారకాలు, IPM కిట్లు, లింగాకర్షక బుట్టలు మొదలైన వనరులు రాయితీపై సరఫరా చేయబడును.
- పొలంబడి కార్యక్రమం పూర్తిగా రైతుల భాగస్వామ్యంతో నిర్వహించబడుతుంది
- పొలంబడి కార్యక్రమ నిర్వహణను, పై స్థాయిలో ఉన్న అధికారులు మరియు వ్యవసాయ శాస్త్రవేత్తలు తరచూ పర్యవేక్షిస్తారు.
- పొలంబడి ముగింపు దశలో క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించి, పొలంబడి కార్యక్రమం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని సాధించిన వైనాన్ని శిక్షణ పొందిన రైతులు, ఇతర గ్రామ రైతులకు తెలియజేయటం జరుగుతుంది.

**పొలంబడి నిర్వహణలో పురోగతి:**

పొలంబడి కార్యక్రమాన్ని ప్రధాన పంటలైన వరి, ప్రత్తి, మొక్కజొన్న, అపరాలు, నూనె గింజలు, చిరుధాన్యాలు మొదలైన పంటలలో వ్యవసాయ శాఖ నిర్వహిస్తుంది.

| క్ర.సం. | సంవత్సరం | నిర్వహించిన పొలంబడుల సంఖ్య | శిక్షణ పొందిన రైతుల సంఖ్య (లక్షలలో) |
|---|---|---|---|
| 1. | 2019-20 | 5222 | 1.56 |
| 2. | 2020-21 | 18840 | 5.65 |
| 3. | 2021-22 | 16067 | 4.83 |
| 4. | 2022 (ఖరీఫ్) | 8509 | 2.55 |
| | **మొత్తం** | **48,638** | **14.59** |

**సాగు ఖర్చు మరియు పంట దిగుబడులపై పొలంబడి ప్రభావం:**

- 2021-22వ సంవత్సరంలో, పొలంబడి నిర్వహించిన వివిధ పంటల యందు, సాగు ఖర్చులు మరియు పంట దిగుబడుల తీరును రైతు పద్ధతిలో పండించిన పంటలతో పోల్చి పరిశీలించగా, పొలంబడి వలన వివిద పంటలలో వ్యవసాయ ఖర్చులు 10 నుండి 22 శాతం వరకు తగ్గినట్లు స్పష్టమైంది.
- పొలంబడి ద్వారా అమలు చేసిన సమగ్ర సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర కలుపు యాజమాన్యం, సాగునీటి యాజమాన్యం మొదలైన శాస్త్రీయ విధానాల వలన వివిధ పంటలలో దిగుబడి 6 నుండి 24 శాతం పెరిగినట్లు గమనించటం జరిగింది.

**పొలంబడి – భవిష్యత్తు కార్యాచరణ:**

వ్యవసాయంలో మేలైన యాజమాన్య పద్ధతులను రైతులలోకి తీసుకెళ్ళటానికి, తద్వారా నాణ్యమైన దిగుబడులను సాధించేందుకు డా॥వై.ఎస్.ఆర్. పొలంబడి సరియైన వేదికగా ప్రభుత్వం భావిస్తుంది. మేలైన వ్యవసాయ పద్ధతులు (Good Agricultural Practices) ద్వారా పండించిన పంటలకు, G AP సర్టిఫికెట్‌ను జారీ చేయుట వలన, బహిరంగ మార్కెట్‌లో ఆ ఉత్పత్తులకు మంచి ధర పలికి రైతుకు ఎంతో లాభం చేకూరుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేస్తూ, మేలైన వ్యవసాయ పద్ధతులు మరియు సర్టిఫికేషన్ ప్రక్రియ కోసం అవసరమైన అన్ని సన్నాహాలు చేస్తుంది.

**FAO - TCP కార్యక్రమం:**

రైతులు సుస్థిరమైన పంటల సాగును పాటించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అవసరమైన సాంకేతికపరమైన తోడ్పాటును FAO నుండి పొందేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం FAO తో ఒక ఒప్పందం కుదుర్చుకుని, FAO - TCP కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ కార్యక్రమం క్రింద వ్యవసాయ మరియు ఉద్యాన శాఖలలో వివిధ స్థాయిలో పనిచేయుచున్న 130 అధికారులను, రాష్ట్రంలో వ్యవసాయ మరియు ఉద్యాన పంటల సాగు చేయుచున్న 240 మంది రైతులను ఎంపిక చేసి వారికి జి.ఎ.పి. మరియు సర్టిఫికేషన్‌పై 2022 జూన్, జులై మరియు సెప్టెంబరు మాసాలలో 3 దఫాలుగా శిక్షణ ఇవ్వబడింది.

**జి.ఎ.పి. మరియు సర్టిఫికేషన్ అమలుపై పొలంబడి క్లస్టర్ల ఏర్పాటు:**

- వివిధ పంటలలో మేలైన వ్యవసాయ పద్ధతులు (జి.ఎ.పి) మరియు సర్టిఫికేషన్ ప్రక్రియ అమలు కోసం, ప్రతి జిల్లా నందు 100 హెక్టార్ల విస్తీర్ణంలో పొలంబడి క్లస్టర్‌ను ప్రయోగాత్మకంగా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసింది.
- 2022–23 రబీ సీజన్‌లో పొలంబడి క్లస్టర్ల ద్వారా జి.ఎ.పి. & సర్టిఫికేషన్ ప్రక్రియను అమలు చేయుటకు, వ్యవసాయ మరియు ఉద్యాన శాఖలలో పని చేయుచున్న జిల్లా స్థాయి, డివిజనల్ మరియు మండల స్థాయి అధికారులకు, శిక్షణ ఇవ్వటం పూర్తయింది.
- ఆర్.బి.కెల స్థాయిలో పని చేయుచున్న గ్రామ వ్యవసాయ సహాయకులకు మరియు క్లస్టర్ రైతులకు విస్తృత స్థాయిలో శిక్షణ ఇవ్వడం పూర్తయింది.